## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సిరికొండలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న నాయకులు

భీమ్‌గల్, జూన్ 1: భీమ్‌గల్ మండలంలోని పురాణీపేట్ గ్రామంలో ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులు సీరం అను సాగర్, దైడి సురేశ్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

**సిరికొండలో..**

సిరికొండ, జూన్ 1 : మండల కేంద్రం లో ఆదివారం సీఎంఆర్ఎల్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన సాబావత్ భూలికు రూ.40 వేలు, సూరు పాక నాగలక్ష్మికి రూ.44 వేలు, దాసరి సునీతకు రూ. 20 వేలు, బోడ తిర్మలకు రూ. 7వేలు, ఖానపురం సునీతకు రూ.15వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు దేగం సాయన్న, భాస్కర్‌రెడ్డి, దువ్వూరి భాస్కర్‌రెడ్డి, గోదావరి, చాకల రమేశ్, ముషీర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఇందల్వాయి, జూన్ 1 : మండలంలో 3 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకట్‌రావు తెలిపారు. భూభారతిపై ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించుకునేందుకు గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులు 3 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు ఈ సదస్సులో రైతులు గ్రామస్తులు పాల్గొనాలని సూచించారు.

## కొనసాగుతున్న సీపీఐ మహాసభలు



సుద్దులం శాఖ మహాసభలో మాట్లాడుతున్న విఠల్‌గౌడ్

కోటగిరి, జూన్ 1 : పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసమే గ్రామ గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో శాఖ మహా సభలు నిర్వహిస్తున్నామని సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కోటగిరి మండలం సుద్దులం గ్రామంలో ఆదివారం రాత్రి ఎత్తొండ గ్రామంలో మహాసభ నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్లా గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



బోర్గాంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్

రెంజల్, జూన్ 1 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బోర్గాం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ విషయంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రెస్ మీట్‌లకే పరిమితమవుతున్నారే తప్ప ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడంలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 57 ఏండ్లు నిండిన వారికి రూ. 4 వేల పింఛన్ ఇవ్వాలని, కల్తీ పురుగుల మందును అరికట్టాలని, ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పుట్టి నాగన్న, పార్వతి రాజేశ్వర్, నాగన్న, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు

## హాసాకొత్తూర్ విద్యార్థిని



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని ప్రతిభ

మోర్తాడ్, జూన్ 1: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ ఉన్నతపాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రతిభ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణకుమార్ తెలిపారు. నిజామాబాద్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన ప్రతిభను సెలెక్టర్లు రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు నల్గొంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రతిభను, శిక్షణ ఇచ్చిన పీడీ మాధురిని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి సర్వం సిద్ధం

కోటగిరి జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కోటగిరి ఇన్‌చార్జి ఎంపీడీవో చందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు జాతీయ పతాకవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కూడా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★ **I, GANGANI KUMAR** S/o. GANGANI BALRAJU R/o. H.No. 2-74, Village: BHAVANIPET Mdl- PALWANCHA DIST: KAMAREDDY-503111, TS. Changed My Name As **GANGANI RAJU KUMAR** S/o. GANGANI BALRAJU

**NT-347155**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# బోధన్‌లో కుక్కలకు ‘ఏబీసీ’ శస్త్రచికిత్సలు

**• ఇప్పటివరకు 150 కుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు**



కుక్కలకు ఏబీసీ శస్త్రచికిత్సల కోసం వ్యాన్‌లో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బోధన్, జూన్ 1: బోధన్ పట్టణంలో కుక్కల బెడద నివారణకు కొన్ని రోజులుగా మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో కుక్కల బెడదతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందుల దృష్ట్యా కుక్కల పునరుత్పత్తిని ఆపేదిశగా, జంతు రక్షణ చట్టాలకు లోబడి మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. కుక్కలను పట్టుకుని వాటికి పిల్లలు పుట్టకుండా యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. దీనికోసం పట్టణంలోని కాలనీలు, మురికివాడలు, శివారు ప్రాంతాల్లో కుక్కలు ఎక్కువగా ఉండే చోట వాటిని బోన్లు, వలల సహాయంతో పట్టుకుని వ్యాన్‌లో నిజామాబాద్‌కు తరలిస్తున్నారు. అక్కడ వాటికి ఆపరేషన్లు చేయించి, వాటిని తిరిగి వాటి యథాస్థానాల్లో వదిలిపెడుతున్నారు. ఇప్పటివరకూ మున్సిపాలిటీ పరిధిలో 150 కుక్కలకు ఆపరేషన్లు జరిగాయని, ఈ ప్రక్రియ మరికొన్ని రోజులు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# ‘జీపీ కార్మికులకు వేతనాలు పెంచి.. పర్మినెంట్ చేయాలి’

ధర్పల్లి, జూన్ 1 : పంచాయతీ కార్మికులకు వెంటనే యుద్ధప్రాతిపదికన పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛభారత్‌లో స్వచ్ఛ తెలంగాణను సాధించడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వారికి సెల్యూట్ పెట్టి సన్మానాలు చేసే ప్రభుత్వాలు వేతనాలు పెంచి పర్మినెంట్ చేయడంలో జాప్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలపై సమ్మె చేస్తే సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చి కాలయాపన చేసి మోసం చేశారన్నారు. సమ్మె సందర్భంగా ఆనాడు కాంగ్రెస్ పార్టీ నాయకులు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, సీతక్క, భూపతిరెడ్డి చాలా మంది కాంగ్రెస్ నాయకులు తమ శిబిరానికి వచ్చి మద్దతు తెలిపారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జీపీ కార్మికులను పర్మినెంట్ చేసే బాధ్యత నాదేనన్న రేవంత్‌రెడ్డి హామీనిచ్చిన సంగతిని గుర్తు చేశారు. రోజురోజుకూ ధరలు పెంచుతుండడంతో జీపీ కార్మికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు బాలయ్య, గంగన్న, శంకర్, సంజీవ్ పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఘనంగా పోచమ్మ పండుగ



ధర్పల్లిలో బోనాలతో వెళుతున్న గ్రామస్తులు

ధర్పల్లి/సిరికొండ/ఇందల్వాయి/భీమ్‌గల్, జూన్ 1 : తల్లి నీకు బోనాలు సల్లంగా చూడాలంటూ మండల కేంద్రంలో బోనాల పండుగ నిర్వహించారు. వీడీసీ ఆధ్వర్యంలో అన్ని కులాల సభ్యులు బోనాలు తీసి గ్రామంలోని గ్రామదేవతలకు పూజలు చేసి గ్రామ పొలిమేరల్లో ఉన్న గద్దెల వద్దకు వెళ్లి ఆచార సాంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బోనాల నైవేద్యంను అమ్మవారికి సమర్పించారు. సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ భోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన భోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి,పంటలు బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు.

ఇందల్వాయి మండల కేంద్రంతో పాటు చంద్రాయన్‌పల్లి, గన్నారం గ్రామాల్లో పోచమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు బోనాలను సమర్పించారు. అనంతరం గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ప్రతి సంవత్సరం పాడి పంటలు, పశువులు బాగుండాలని కోరుతూ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పండుగను నిర్వహిస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం గ్రామ దేవతలకు బలిహరణం నిర్వహించి వనభోజనాలకు వెళ్లారు. భీమ్‌గల్ మండలంలోని పిప్రి గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, వివిధ కుల సంఘాలకు చెందిన వారు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురవాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

# మూడు నెలల రేషన్ పంపిణీకి ఆదిలోనే హంసపాదు

**• మొదటిరోజున బోధన్‌లో అరకొరగా రేషన్ బియ్యం పంపిణీ**

**• సర్వర్‌డౌన్‌తో డీలర్ల అవస్థలు • రాష్ట్ర ప్రభుత్వం కేజీ బియ్యం బ్యాలెన్స్‌ను చూపని మెషిన్లు**

బోధన్, జూన్ 1: రాబోయే మూడు నెలలకుగానూ ఒకేసారి రేషన్ బియ్యం ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. తొలి రోజు రేషన్ బియ్యం పంపిణీ బోధన్ పట్టణంలోని అనేక చౌకధరల దుకాణాల్లో సక్రమంగా జరగలేదు. వర్షాకాలం కారణంగా రానున్న మూడు నెలలపాటు సబ్సిడీ బియ్యం సరఫరాలో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున జూన్, జూలై, ఆగస్టు నెల బియ్యాన్ని ఒకేసారి జూన్ నెలలోనే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయించింది. ఈ మేరకు ఆయా చౌకధరల దుకాణాలకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం సరఫరాకు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించినట్లు ఆదివారం నుంచి రేషన్ షాప్‌ల నుంచి బియ్యం పంపిణీచేసేందుకు డీలర్లు సన్నద్ధమయ్యారు. అయితే, ఉదయం నుంచే సర్వర్ డౌన్ అవడంతో మిషన్లు పనిచేయలేదు. దీంతో బియ్యం కోసం రేషన్ షాప్‌లకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సర్వర్ డౌన్‌తో కొన్ని దుకాణాల్లో బియ్యం పంపిణీ జరగలేదు. కొన్ని చోట్ల బియ్యం పంపిణీ జరిగినప్పటికీ..ఒక్కో మనిషికి ఇచ్చే 6 కిలోల బియ్యంలో కేంద్ర ప్రభుత్వం వాటా 5 కిలోలు తమకు కేటాయించిన బియ్యం నిల్వల్లో కట్ అవుతున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వాటాకు చెందిన ఒక కిలో బియ్యం బ్యాలెన్స్ చూపించడంలేదని డీలర్లు వాపోతున్నారు. ఈ పరిస్థితితో తమకు ఇబ్బందులు ఉంటాయని వారు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాకు చెందిన కిలో బియ్యం కూడా తాము కేంద్ర ప్రభుత్వం వాటా 5 కిలోలతో కలిపి రేషన్ కార్డుదారులకు ఇవ్వవలసి వస్తున్నదని, ఈ సాంకేతిక సమస్యల వల్ల రేషన్ పంపిణీ ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. చాలా రేషన్ దుకాణాలు చిన్నగా ఉండడం వల్ల ఒకేసారి మూడు నెలల సరుకును నిల్వచేయడం సమస్యగా మారింది. తొలకరి వర్షాలు ప్రారంభంకానున్నందున వెంటనే రేషన్ బియ్యం పంపిణీ సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రేషన్ కార్డుదారులు కోరుతున్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నందిపేట్/వేల్పూర్/నవీపేట/జక్రాన్‌పల్లి/సిరికొండ/పొతంగల్, జూన్ 1 : పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆయా మండలాల్లోని పాఠశాలలు, ఫంక్షన్ హాళ్లలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ బాల్య జ్ఞాపకాలు, పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలను ఒకరు పంచుకున్నారు. చదువు చెప్పిన పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. నందిపేట్ మండల కేంద్రంలోని నంది ప్రగతి హైస్కూల్‌లో 2000-2001 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలంలోని రామన్నపేట్ గ్రామంలో 1999-2000 సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నవీపేట మండలంలోని పొతంగల్ గ్రామ సమీపంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నవీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆనాటి విద్య నేర్పిన గురువులు నర్రరామరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి శాలువా మెమోంటోతో ఘనంగా సన్మానించారు. జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 2009-10 బ్యాచ్ విద్యార్థులు అపూర్వ మధురాను భూతులతో ఆత్మీయంగా సమ్మేళనం జరుపుకున్నారు. సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్ ఉన్నత పాఠశాల 2001-2002 బ్యాచ్ విద్యార్థులు సమ్మే ళనంలో పాల్గొన్నారు. పొతంగల్ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన 1996-97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.



పెద్దవాల్గోట్‌లో 2001-2002 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు



నవీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు




నందిపేట్ హైస్కూల్ 2000-2001 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు



పొతంగల్ జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



అర్గుల్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 2009-10 విద్యార్థులు



రామన్నపేట్ 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

## బస్సు బైక్ ఢీ : వ్యక్తికి గాయాలు

నందిపేట్, జూన్ 1 : మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద నిజామాబాద్ నుంచి వస్తున్న ఓ ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని మాయాపూర్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న మురళిగా గుర్తించారు. మురళి ఎడమ కాలుపై నుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో కాలు విరిగిందని, బాధితుడిని 108 అంబులెన్సులో జిల్లా దవాఖానకు తరలించామని స్థానికులు తెలిపారు.

## రెండు ఇసుక టిప్పర్లు పట్టివేత



హంగర్గ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

బోధన్ రూరల్, జూన్ 1 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం హంగర్గ శివారులో ఎస్సై శనివారం రాత్రి తన సిబ్బందితో కలిసి మంజీరా నది నుంచి అక్రమంగా తరలిస్తున్న సమాచారం రావడంతో దాడి నిర్వహించి రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**డోజర్లతో ఇసుక లోడింగ్.. ఆగ్రహం చేస్తున్న లేబర్లు ..**

బోధన్ మండలంలోని సిద్ధాపూర్ శివారులోని మంజీరా నది నుంచి డోజర్‌లతో ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ఆదివారం సెలువు దినం కావడంతో ఇసుక ట్రాక్టర్లను డోజర్లతో నింపడంతో లేబర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డోజర్ల ద్వారా ఇసుక నింపితే మేము బతకడం ఎలా అని ప్రశ్నిస్తున్నారు. మాకు ఉపాధి దొరకడం లేదని లేబర్లు అంటున్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పొతంగల్, జూన్ 1: ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను తహసీల్దార్ గంగాధర్ ఆదివారం పట్టుకున్నారు. మండలంలోని కొడిచర్ల మంజీరా నది శివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ముస్లిం మైనార్టీ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ముస్లిం కమిటీ సభ్యులు

నందిపేట్, జూన్ 1 : మండల కేంద్రంలో ముస్లిం మైనార్టీ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆయా అంశాలపై చర్చించిన అనంతరం కమిటీలు ప్రకటించా రు. అధ్యక్షుడిగా షౌకతుల్ బారీ, ఉపాధ్యక్షులుగా జమీల్, ఖదీర్, ఇమామ్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ మక్బుల్, కోశాధికారిగా అబ్దుల్ గనీ, సంయుక్త కార్యదర్శిగా ఫారూఖ్, వాజిద్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సయ్యద్ హుస్సేన్, సలీం, డాక్టర్ అహ్మద్, నజీర్, పాషా పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీకి తగ్గిన వరద

మోర్తాడ్, జూన్ 1: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి మూడునాలుగు రోజులుగా వర్షాలు లేకపోవడంతో వరద తగ్గిపోయింది. ప్రాజెక్ట్‌లోకి ఆదివారం 672 క్యూసెక్కుల వరద వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు)కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1062.20అడుగులు(12.788టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 341 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆర్మూర్‌కు వచ్చిన మాధవనంద సరస్వతి

ఆర్మూర్‌టౌన్, జూన్ 1 : ఆర్మూర్ పట్టణంలోని రాజరాంనగర్ కాలనీలో శివ పంచాయతన శివాలయానికి మాధవానంద సరస్వతి స్వామిజీ ఆదివారం వచ్చారు. ఆయనకు వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివలింగానికి రుద్ర పారాయణం, అభిషేకం చేశారు. స్వామివారికి పాదపూజ చేసినట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

రెంజల్, జూన్ 1 : భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో వాటిపై అవగాహన కోసం నిర్వహించే రెవెన్యూ సదస్సులను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి 16 వరకు గ్రామాల్లోని రైతు వేదికలు, ప్రభుత్వపాఠశాలలు, గ్రామ పంచాయతీ భవనాల్లో ఏర్పాటు చేసే రెవెన్యూ సదస్సులను రైతులు ఉపయోగించుకోవాలని తహసీల్దార్ సూచించారు.

## 22వ ప్రతిభా పురస్కార మహోత్సవం

ఆర్మూర్‌టౌన్, జూన్ 1: ఆర్మూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో జిల్లా దేవాంగ విద్యా కమిటీ నిజామాబాద్ ఆధ్వర్యంలో 22వ ప్రతిభా పురస్కారాలను దేవాంగ సంఘం సభ్యులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దేవాంగులు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉద్యోగాలు పొందిన వారిని అభినందించారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



జాగిర్యాల్‌లో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న నాయకులు

భీమ్‌గల్, జూన్ 1: మండలంలోని జాగిర్యాల్ గ్రామంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మంజూరు చేసిన నిధులతో సీసీ రోడ్డు పనులను ఆదివారం స్థానిక నాయకులు ప్రారంభించారు. రోడ్డు కోసం ఎమ్మెల్యే రూ. 10 లక్షల నిధులు కేటాయించారు. ఈ సందర్భంగా నాయకులు, గ్రామస్తులు వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్, నాయకులు గడాల ప్రసాద్, ఓమాయి రాజేశ్వర్, రాజమల్లు శ్రీనివాస్, శ్రీకాంత్, రాజేశ్వర్, కిషన్, రసూల్, జలపతి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.